దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : హిందూ సంప్రదాయాల్లో విజయదశమి విశిష్టమైన రోజు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగను శనివారం వైభవంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై రావణ ప్రతిమ దహనం కోసం భక్తులు తరలివస్తారు. ఇందుకోసం పురపాలిక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్తు దీపాలంకరణ, పార్కింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాలు, ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద తొమ్మిది రోజులు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. జిల్లా కేంద్రంలో పెద్దవాగు సమీపాన ఉన్న కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీష్‌కుమార్ ఏర్పాట్లు పరిశీలించి కమిటీకి సూచనలు చేశారు. విజయదశమి రోజున రావణ వధ, జమ్మిచెట్టుకు పూజ చేయడం ఆనవాయితీగా వస్తుంది.



కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై దసరా ఉత్సవాల్లో భాగంగా దహనానికి సిద్ధమైన రావణాసురుడి ప్రతిమ



విద్యుద్దీపాలతో ముస్తాబైన కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయం



త్రిశూల్‌పహాడ్‌పై దుర్గామాత ఆలయంలో అమ్మవారు

దసరా.. ఎగరేయాలి గెలుపు బావుటా.. 12లో

రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు జిల్లా పోలీసులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన ఎస్సై, పోలీస్ కానిస్టేబుళ్లు అయిదుగురు రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైనట్లు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. పరిశోధన, శాస్త్రీయ దర్యాప్తు విభాగంలో ఎం.ప్రశాంత్ (ఎస్సై, వాంకిడి), కానిస్టేబుళ్లు రుకియా సుల్తానా (ఆసిఫాబాద్), శ్రీనివాస్ (కెరమెరి పీఎస్)లు, డాగ్ స్క్వాడ్, నార్కోటిక్స్ పదార్థాల తనిఖీకి సంబంధించి పోలీసులు రోహిత్ (ఏఆర్ హెడ్‌క్వార్టర్), ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీల్లో టి.వెంకటస్వామి (ఏఆర్ హెడ్‌క్వార్టర్)లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 18 వరకు టీజీపీఏలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్లో వీరు ఆడనున్నట్లు చెప్పారు. ఎంపికైన వీరిని ఎస్పీ, అదనపు ఎస్పీలు అభినందించారు.



పోటీలకు ఎంపికైన పోలీసులతో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

భవన నిర్మాణం.. నాణ్యత.. అధ్వానం!

- ఐటీడీఏ, పంచాయతీరాజ్ శాఖల పనుల దుస్థితి

పది కాలాలపాటు మన్నికగా ఉండాల్సిన భవన నిర్మాణాలు పనులు జరుగుతుండగానే పగుళ్లు తేలుతుండటం సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేమి, నిధులు పక్కదారి పడుతున్న తీరును తేటతెల్లం చేస్తున్నాయి. మరికొన్ని చోట్ల స్వల్ప వ్యవధిలోనే పనికి రాకుండా పోతున్నాయి. శాఖలు ఏవైనా అధ్వానంగా సాగుతున్న పనుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలను నాణ్యతతో చేపడితేనే బిల్లులు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొన్నిచోట్ల స్వయంగా ఫిర్యాదులు చేసినా.. అధికారులు పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.



కొలాంగూడలో పనుల తీరిది



రౌట సంకెపల్లి భవన నిర్మాణంలో కనిపిస్తున్న ఇనుప చువ్వలు

కెరమెరి మండలంలోని కొలాంగూడ వద్ద నిర్మిస్తున్న సమీకృత భవనం ఇది. కింది భాగంలో సిమెంటు బెడ్ వేయాల్సి ఉన్నా గుత్తేదారు పట్టించుకోకపోవడంతో పగుళ్లు తేలాయి. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. పగుళ్లపై సిమెంటు పూసి పనులు కానిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు. పాత రౌట సంకెపల్లిలో సమీకృత భవనానికి బెడ్ వేసి చేస్తున్న సిమెంటు పనులు సైతం అధ్వానంగా సాగుతున్నాయి. ఇనుప చువ్వలు పైకి తేలి కనిపిస్తున్నాయి.



వాంకిడి మండలం గోయగాంలో డీఆర్‌డిపో భవనానికి వచ్చిన పగుళ్లు

ఆసిఫాబాద్ మండలం మోవాడ్, వాంకిడి మండలం గోయగాం గ్రామాల్లో డీఆర్‌డిపోలు ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు ఖర్చు చేశారు. నిర్మించి ఏడాది కాకముందే ఇవి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. భవనమంతా పగుళ్లు తేలాయి. రాయితీ బియ్యం నిల్వ చేయలేని పరిస్థితి నెలకొందని, వర్షాలు కురిసే సమయంలో నీరు లోపలకు వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు.

ఈనాడు, ఆసిఫాబాద్

ఐటీడీఏ (సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ) నుంచి కొలాం తెగలు నివాసముంటున్న 14 గ్రామాల్లో బహుళ అవసరాలకు (మల్టీపర్పస్) వినియోగించేలా భవనాలను మంజూరు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల భవనాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేలా వీటిని పూర్తి చేస్తున్నారు. ఒక్కో భవనానికి రూ.60 లక్షల చొప్పున మొత్తం రూ.8.40 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో నాలుగు ప్రారంభం కాగా స్లాబ్‌ల వరకు నిర్మాణాలు జరుగుతున్నాయి. మరో 11 టెండర్ల దశలోనే ఉన్నాయి. గుత్తేదారులు ఎప్పటిలాగానే స్థానికంగా లభించే నాసిరకమైన నల్లని ఇసుక, క్యూరింగ్ లేకపోవడం, తగుపాళ్లలో సిమెంటు వాడకపోవడంతో పగుళ్లు తేలుతున్నాయి.



చిరుధాన్యాల యూనిట్‌లో పడిపోయిన టైల్స్

ఆసిఫాబాద్ మండలంలోని సాలేగూడ వద్ద చిరుధాన్యాలతో పోషకాహార తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టు పరిశ్రమకు చెందిన పాత భవనానికి రూ.20 లక్షలు కేటాయించి మరమ్మతులు చేశారు. గోడలకు బిగించిన టైల్స్ పూర్తిగా పగిలిపోయాయి. గచ్చు చాలా చోట్ల పగుళ్లతో కనిపిస్తోంది. వెంటనే బాగు చేయాలని మహిళా సంఘ సభ్యులు కోరుతున్నారు.

పర్యవేక్షిస్తాం: నిజాముద్దీన్, ఏఈ

భవన నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తాం. నిబంధనలకు మేరకు నిర్మిస్తేనే ఎంబీ రికార్డు చేసి బిల్లులు చెల్లించేలా చూస్తాం.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌లపై పోటీలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాణంపై పోటీలు ఉంటాయని ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శాంతి భద్రతలు, సమాజ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల జ్ఞాపకార్థం ఏటా అక్టోబరు 21 పోలీస్ ఫ్లాగ్ డేను నిర్వహిస్తామన్నారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో కనబరుస్తున్న తెగువ, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయంలో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాల నివారణ, ఈవ్ టీజింగ్-షీ బృందం, మత్తు పదార్థాలు వాడకంతో కలిగే అనర్థాలపై తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్‌ఫిల్మ్‌లను ఈ నెల 24 లోపు అందించాలన్నారు. షార్ట్ ఫిల్మ్‌ను సీడీలో లేదా పెన్‌డ్రైవ్‌లో తీసుకొని గడువు లోపు పూర్తి వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్, డివిజన్ పోలీసు కార్యాలయాల్లో అందించాలన్నారు.



ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఉపకార వేతనాలకు తపాలా ఖాతాలు తెరవాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ప్రీ, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు తపాలా కార్యాలయాల్లో బ్యాంకు ఖాతాలు తెరవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్ ప్రకటనలో పేర్కొన్నారు. ఖాతా తెరిచేందుకు విద్యార్థులు రూ.149, జీఎస్టీ కలిపి చెల్లించాలన్నారు. ఇంటి వద్దకే పోస్టుమాస్టర్/గ్రామీణ డాక్ సేవకులు వచ్చి సేవింగ్ ఖాతా తెరుస్తారన్నారు.

మీనం.. సగమే లక్ష్యం..

- 14న చెరువుల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు

మత్స్యకారుల ఉపాధి కల్పనే లక్ష్యంగా గత ప్రభుత్వం వంద శాతం రాయితీపై ప్రాజెక్టులు, చెరువుల్లో చేప పిల్లలను ఏటా వానాకాలంలో విడుదల చేసేది. గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడంతో ఈసారి జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఈ నెల 14న జలవనరుల్లో చేప పిల్లల విడుదలకు మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా వివరాలు..

- మత్స్యకారుల సంఘాలు : 65
- సభ్యులు : 2,850
- కొత్తగా దరఖాస్తు చేసిన సంఘాలు : 15
- సభ్యులు : 500
- చేప పిల్లలు విడుదల చేసే ప్రాజెక్టులు : 4
- పెద్ద చెరువులు : 11
- చిన్నవి : 265
- విడుదల చేసే మొత్తం చేప పిల్లలు: 72.92 లక్షలు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

జిల్లాలోని జలాశయాలు, పెద్ద, చిన్న చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. వీటిల్లో 80-100 ఎంఎం, 35-40 ఎంఎం పరిమాణంలోని చేప పిల్లలను విడుదల చేయనున్నారు. ఇవి కనీసం కిలో వరకు పెరగాలంటే 7-8 నెలల సమయం అవసరం. కానీ కొన్ని చెరువుల్లో మార్చి వరకు నీరు ఎండిపోయే అవకాశం ఉంది. ఇలాంటి వాటిల్లో వాటి ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రాజెక్టుల్లో చేప పిల్లలను విడుదల చేసే సమయంలో ఈ సారి కొత్తగా డీపీవో, నీటి పారుదలశాఖ ఈఈల సమక్షంలో జిల్లా మత్స్య అధికారి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సంబంధిత సంఘ సభ్యులు ఉండేలా కమిటీ ఏర్పాటు చేశారు. పెద్ద చెరువుల్లో వేసే సమయంలో కమిటీలో.. ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, చిన్న చెరువులకు సంబంధించి ఏఈవో, పంచాయతీ కార్యదర్శులను నియమించారు.



చెరువులో చేప పిల్లలు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (పాత చిత్రం)

72.92 లక్షల చేపపిల్లలు మాత్రమే..

జిల్లాలో ప్రాజెక్టులు, పెద్ద, చిన్న చెరువులు మొత్తం 280లలో ఏటా 1.46 కోట్ల వరకు చేప పిల్లలను విడుదల చేసేవారు. ఈ సారి లక్ష్యాన్ని సగానికి కుదించడంతో.. 72.92 లక్షలు మాత్రమే విడుదల చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. మధ్యతరహా ప్రాజెక్టు కుమురంభీం జలాశయంలో గతేడాది 21.60 లక్షలు విడుదల చేయగా ఈ సారి 10.80 లక్షలు, వట్టివాగు ప్రాజెక్టులో 13.80 లక్షలు విడుదల చేయగా ఈ సారి 6.90 లక్షలకు తగ్గించారు. గతేడాది ఒక హెక్టార్‌లో 35-40 ఎంఎం చేప పిల్లలు 3000 విడుదల చేయగా ఈసారి 1500 పిల్లలను, 80-100 ఎంఎం పిల్లలు రెండు వేలకు గాను ఈ సారి వెయ్యి చొప్పున విడుదల చేయనున్నారు. కట్ల, రోహు, తదితర రకాలను విడుదల చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

పోటీ పెరిగి రూ.లక్షల్లో ఆదా

గుత్తేదారులు మొదట్లో సిండికేట్‌గా మారి టెండర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. తరువాత మారిన పరిస్థితులతో పోటీ పెరిగి నలుగురు బిడ్‌లు దాఖలు చేశారు. ఇద్దరు ఎంపిక కాగా వీరిలో ఒకరు తక్కువ ధరకు కోట్ చేయడంతో.. అతనికే చేప పిల్లల సరఫరాకు అవకాశం దక్కింది. గతేడాది 35-40 ఎంఎం పరిమాణం కలిగిన లక్ష పిల్లలు రూ.65 వేలు పలకగా ఈసారి రూ.55,737కు టెండర్ వేశారు. 80-100 ఎంఎం పిల్లలు లక్షకు రూ.1.65 లక్షలు పలకగా ఈసారి రూ.1,45,476కు వేశారు.

అనుమతి రాదు... రోడ్డు మరమ్మతులు చేయరు

కెరమెరి మండలంలో సాంగ్వి చౌరస్తా నుంచి ఇందాపూర్ మీదుగా దేవుడ్‌పల్లికి 10 కి.మీ వరకు సుమారు పదేళ్ల క్రితం తారు రోడ్డు మంజూరైంది. కానీ మధ్యలో ఇందాపూర్ ఘాట్ వద్ద అటవీ అనుమతులు కారణంగా రెండు కి.మీ మేర తారు రోడ్డు పనులు నిలిచిపోయాయి. నేటికీ అనుమతి రాకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో రోడ్డు అధ్వానంగా తయారవడంతో వాహన చోదకులకు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇందాపూర్ ఘాట్‌లో రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కెరమెరి**



ఇందాపూర్ ఘాట్‌లో రోడ్డు దుస్థితి



నవెగూడ పల్లె ప్రకృతి వనం

వనానికి దగ్గరగా.. గ్రామానికి దూరంగా

గ్రామాల్లో ఆహ్లాదం అందించేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ స్థలాల కొరతతో కొన్ని గ్రామాల్లో దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని నిరుపయోగంగా మారాయనడానికి వాంకిడి మండలం నవెగూడ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనమే నిదర్శనం. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కుమురంభీం జలాశయ సమీపంలో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఏర్పాటు చేశారు. వీటిలోని మొక్కలు ఏపుగా పెరగడంతో అడవిలోనే మమేకమైనట్లు కనిపిస్తోంది. ఇక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. ఆహ్లాదం పంచడానికి ఉపయోగం లేకుండా పోయింది. **- న్యూస్‌టుడే, వాంకిడి**

దసరా.. లక్ష్యసాధనకు.. జగమేలాలి గెలుపు బావుటా..

● నేడు విజయదశమి

పాండవులు కౌరవులపై, శ్రీరాముడు రావణుడిపై, అమ్మవారు రాక్షసులపై విజయం సాధించిన సందర్భంగా విజయదశమి పండగను జరుపుకొంటుంటాం. ఈ పండగ విజయానికి ప్రతీక.. ప్రతిఒక్కరూ తాము నిర్దేశించుకున్న లక్ష్యంకోసం అహర్నిశలు శ్రమిస్తూ... కొత్త ఉత్సాహంతో ముందుకు సాగితే విజయం మనదే అవుతుంది. జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వివిధ ఉద్యోగ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పరచుకున్న లక్ష్యం వైపు ఈ రోజు నుంచే అడుగులు వేసి విజయతీరాలకు చేరుకోవాలి. యువత, మహిళలు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరూ తాము కన్న కలలను సాకారం చేసుకునేందుకు ముందుకు సాగాలి.





దండేపల్లి, న్యూస్‌టుడే

ఆర్థిక సాధికారత దిశగా..

ఉమ్మడి జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 1,926

స్వయం సహాయక సంఘాలు: 41,998

సభ్యులు: 4.25 లక్షలు

మహిళలు ఆర్థిక సాధికారత సాధించిననాడే ఆ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకంలో ఇందిరా మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక మహిళలకు ప్రభుత్వం రుణాలు అందిస్తోంది. దీంతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తూ ఆదాయం పొందుతూ సంఘాలను పటిష్ఠం చేసుకుంటున్నారు. కుటుంబ పరిశ్రమలు, సాంకేతిక పరంగా కంప్యూటర్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ తదితర రంగాల్లో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలి...

విద్యార్థీ విజయోస్తు..

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గురుకులాలు, ఇలా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారు. మార్చి నుంచి ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి.

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు: 126

విద్యార్థులు: 46,000



పాఠశాలలు: 4,779

విద్యార్థులు: 4.80లక్షలు

కలలు కని.. సాకారం చేసుకుని

ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. సంవత్సరాల తరబడి సాధన చేశారు. కలలు సాకారం చేసుకున్నారు. అనుకున్నది సాధించారు. త్వరలోనే బడుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులు, ఎస్జీటీలుగా వంద లాది మంది ఎంపికై నియామక పత్రాలు తీసుకున్నారు. వీరంతా రాత్రనక, పగలనక, ఇళ్లలో, గ్రంథాలయాల్లో, శిక్షణ కేంద్రాల్లో సాధన చేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని అభ్యర్థులు మరింత ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ముందుకు సాగి కొలువులు సాధించాలి..



ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల్లో కొందరు..

డీఎస్సీలో కొలువుల ఇలా..

భర్తీ చేయనున్న పోస్టులు (అన్ని కేడర్లలో)

ఆదిలాబాద్:	266
కుమురంభీం:	270
మంచిర్యాల:	288
నిర్మల్:	278

గురిపెడితే గ్రూప్ విజేతవే..

ఈ నెల 21 నుంచి మొదలు డిసెంబరు వరకు గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సమయం సద్వినియోగం చేసుకుంటే సాధన చేస్తే సర్కారు కొలువు సాధించవచ్చు. ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరముంది. రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రూప్-1 ఉద్యోగాలకు గతంలోనే ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తయి ఫలితాలు రావడంతో ఈ నెల 21 నుంచి మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 18,213 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్షలు రాయగా 10 వేల మంది మెయిన్‌కు అర్హత సాధించారు. దీంతోపాటు ఇప్పటికే గ్రూప్-2లో రాష్ట్రవ్యాప్తంగా 783 పోస్టులు ఉండగా ఉమ్మడి జిల్లాలో 26 వేల మంది పరీక్ష రాసేందుకు సాధన చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గ్రూప్- 3 పోస్టులకు ఈ ఏడాది నవంబరు 15, 16 తేదీల్లో పరీక్షలు జరగనుండగా జిల్లా నుంచి 14 వేల మంది పరీక్ష రాయనున్నారు. ఇవే కాకుండా నేవీ, ఆర్మీ, రైల్వే, బ్యాంకు ఉద్యోగాలకు డిసెంబరులోగా పరీక్షలు జరగనున్నాయి.



ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగార్థులు

మొక్కవోని దీక్షతో..



ఈమె పేరు మామిడాల వనిత. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి గ్రామం. పేద కుటుంబం. భర్త జనార్దన్ ప్రైవేటు ఉద్యోగి. ఈమెకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఒక వైపు బాబును చూసుకుంటూనే మరో వైపు ఆత్మవిశ్వాసంతో కృషి చేసింది.. ఏడాది నుంచి ఇంటి వద్దనే కష్టపడుతూ డీఎస్సీలో 47వ ర్యాంకుతో కొలువు సాధించింది..

డిజీలాకర్.. ధ్రువపత్రాలు భద్రం..

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఉద్యోగాలు, ప్రవేశాలకు వివిధ ధ్రువపత్రాలు తప్పనిసరి. ఆ సమయంలో హడావుడిలో ఏదో ఒకటి మరచిపోతుంటాం. వెనక్కి వెళ్లలేక అధికారులను బతిమాలుకుంటారు. వారు అనుమతి ఇవ్వకపోతే అవకాశం చేజారుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు అందుబాటులోకి వచ్చిన డిజిటల్ వ్యవస్థ దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్షిత డిజీలాకర్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పాస్‌పోర్టు దరఖాస్తులకు డీజీ లాకర్‌లోని పత్రాల వినియోగానికి అనుమతి ఇస్తుండటం గమనార్హం..

అనుసంధానం..

డిజీలాకర్‌కు అనుసంధానమైన ప్రభుత్వ శాఖల పత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఇందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే సరిపోతుంది. అవన్నీ తెరపై కనిపిస్తాయి. ఒకవేళ అనుసంధానం కాకపోతే స్కాన్ చేసి భద్రపరుచుకోవచ్చు. ఇందుకు 1 జీబీ స్టోరేజీ సామర్థ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ధ్రువ పత్రాల సమర్పణకు యూఆర్ఎల్ లింకు పంపించడానికి కొన్ని సంస్థలు కూడా అనుమతిస్తాయి.



డిజీలాకర్ యాప్ ముఖచిత్రం

ఏయే పత్రాలు అంటే..

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ, జనన ధ్రువపత్రాలు, ఆస్తులకు సంబంధించినవి, రేషన్‌కార్డు, బీమా పత్రాలు, ఓటరు కార్డు, తదితర పత్రాలను భద్రపరుచుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వంటి పత్రాలను దగ్గర ఉంచుకునే బదులు ప్రభుత్వ అధీకృత యాప్‌లో భద్రపరుచుకుంటే మన సమాచారం సురక్షితంగా ఉంటుంది. డిజీలాకర్‌లో చేరగానే పదోతరగతి మొదలుకొని ఆపై తరగతుల పత్రాలను జతచేయాలి

ఏం చేయాలంటే..

ముందుగానే స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి డిజీ లాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. దానిని ఓపెన్ చేసి పేరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఆరు అంకెల పాస్‌వర్డ్ ఇవ్వాల్సి ఉంటుంది. చరవాణికి వచ్చిన ఓటీపీని నమోదు చేస్తే ఖాతా తెరుచుకుంటుంది. ఆ తర్వాత యాప్‌లో పాన్‌కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలజాబితా కనిపిస్తాయి. అందులో మనకు కావాల్సింది ఎంచుకొని అడిగిన మేర వివరాలు నమోదు చేయాలి.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయస్థానం



పతకం, ప్రశంసాపత్రాలతో ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులు

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రతిభచాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు 53వ సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగినట్లు చెప్పారు. మూడో స్థానంలో నిలిచిన జట్టును, దానికి సారథిగా వ్యవహరించిన రమ్య, శిక్షకులు అరవింద్, కల్యాణ్‌లను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు అభినందించారు.

వ్యవసాయ కూలీ బిడ్డ



ఆదిలాబాద్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ సట్లవార్ జ్యోతి కుమారుడు హర్ష్ బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తండ్రి సంజయ్ అనారోగ్యంతో చనిపోయాడు. అమ్మ ఆశలు నెరవేర్చే దిశగా వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ చాటాడు. జిల్లాలోని ప్రదేశాలను చూడని తాను ఏకంగా గుజరాత్‌లో ఏడు రోజులపాటు జరిగే సదస్సుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లా గురించి గర్వంగా చెబుతా..



ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన గుండావార్ మహేష్-శీతల్ దంపతుల కూతురు అక్షర ప్రేరణ జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను సదస్సులో జిల్లా గురించి గర్వంగా చెబుతానని అక్షర చెబుతోంది.

ప్రతిభ చాటి.. ప్రేరణలో మెరిసి

● జాతీయ సదస్సుకు ఆదిలాబాద్ విద్యార్థుల ఎంపిక
● నేడు గుజరాత్‌కు పయనం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:

వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి జాతీయతభావం పెంపొందించేలా 'ప్రేరణ ఉత్సవ్' పేరిట కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించి ఆ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని జాతీయస్థాయి సదస్సుకు ఎంపిక చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. గైడ్ టీచరుతో కలిసి వారిద్దరు శనివారం గుజరాత్ రాష్ట్రంలోని వాడ్‌నగర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

విద్యార్థులకు దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, దేశం కోసం ఏం చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేలా కేంద్రం 'ప్రేరణ ఉత్సవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏప్రిల్‌లో అన్ని పాఠశాలల నుంచి ప్రతిభ ఉన్న ఇద్దరు విద్యార్థుల చొప్పున ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో 70 మందికి ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన వారిని ముఖాముఖి ద్వారా జాతీయ సదస్సుకు ఎంపిక చేశారు. అలా బంగారుగూడ ఆదర్శ పాఠశాల విద్యార్థి సట్లవార్ హర్ష్, లిటిల్‌ఫ్లవర్ విద్యార్థిని గుండావార్ అక్షర ఎంపికయ్యారు.


రేపటి నుంచి శిక్షణ తరగతులు

ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం మేహసన జిల్లా వాడ్‌నగర్ కేంద్రీయ విద్యాలయంలో జాతీయ సదస్సు జరగనుంది. ఏడు రోజులపాటు స్వాభిమాన్, ధైర్య సాహసాలు, భిన్నత్వంలో ఏకత్వం, సత్య నిష్ఠ, నిజాయితీ-నాయకత్వం, సాంకేతిక, విశ్వసనీయత, స్వేచ్ఛ-కర్తవ్యం, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. చారిత్రక ప్రదేశాలను చూపించనున్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులతోపాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, ఒడిశా, బిహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల విద్యార్థులతో కలిసి జిల్లా విద్యార్థులు సదస్సులో పాల్గొననున్నారు. సదస్సులో నిర్వహించే ప్రతిభా పోటీల్లో ఎంపికైతే జనవరి 26న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం ఇవ్వనున్నారు.

ప్రతినబూనితే.. ప్రగతి ప్రస్థానమే

● ఉమ్మడిజిల్లాకు అపార అవకాశాలు..





ఈటీవీ ఆదిలాబాద్ :

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సహజ సిద్ధమైన వనరులు సద్వినియోగమయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కంకణబద్ధులై ఆలోచిస్తే జిల్లా విజేతగా నిలుస్తోంది. విజయదశమి సందర్భంగా ఇక్కడున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిన బూనితే ఉమ్మడి జిల్లా విజయ ప్రస్థానానికి అడ్డే ఉండదు..

అధికారుల పాత్ర

నిజాం ఏలుబడిలో మానవ పరిణామ శాస్త్రవేత్తగా వచ్చిన ఇంగ్లాండ్‌కు చెందిన హైమన్‌డార్ఫ్ మనసును గెల్చుకున్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం సేవా గుణంతో పని చేసిన అధికారులను ఎప్పుడూ మర్చిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ కమిషనర్ రామకృష్ణారావుతోపాటు అహ్మద్‌బాబు, జ్యోతిబుద్ధ ప్రకాశ్, దివ్య దేవరాజన్‌లను గుర్తు చేసుకుంటారు. విధి నిర్వహణను పరమావధిగా భావిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా నేటి అధికారులు పని చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లా ఖ్యాతి ఇనుమడిస్తుంది.

చేయాల్సిందేమిటి



కడెం, సాత్నాల, మత్తడివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ, ఎల్లంపల్లి జలాశయాలను ఆధునికీకరిస్తే ప్రతీ ఎకరానికి నీరవ్వచ్చు. రెండు పంటలు పండించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. మారుతున్న సమాజానికి అనుగుణంగా అటవీ ఉత్పత్తుల వినియోగంలో ఉట్నూరు ఐటీడీఏ, గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ(జీసీసీ)లను ప్రక్షాళన చేస్తే ఆదివాసీ, గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసినట్లే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తే ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపవచ్చు.

మనకున్నదేంటి



ఉమ్మడి జిల్లా 16,203 చదరపు కిలోమీటర్లతో విస్తరించి ఉంది. ఒకప్పుడు 40 శాతం అటవీ ప్రాంతముంటే ప్రస్తుతం 27 శాతానికి పరిమితమైంది. దాదాపు 28 లక్షల జనాభా ఉండగా మాంగనీసు, బొగ్గు, సున్నపు రాయి ఖనిజ సంపద కలిగి ఉంది. పత్తి పంటకు ప్రసిద్ధి పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో సోయా సాగుకు పేరెన్నికగన్నది. కూరగాయలు, మిరప, నువ్వులు, పసుపు, వరి పంటలకు అనుకూలంగా ఉంది. జీవనదులు గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ సహా వాగులు, సెలయేళ్లకు కొదువలేదు.

నేతల చొరవ



గోండు వీరుడు కుమురం భీం, స్వాతంత్ర్య తొలితరం నేతలైన వన్నెల ఎల్లన్న, దాజీ శంకర్, కస్తాల రాంకిషన్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సామల సదాశివలాంటి వారి త్యాగనిరత అమోఘమైనది. జోడేఘాట్, ఇంద్రవెల్లి పోరాట పటిమ ఉద్యమ చరిత్రను చాటేదే. ఆ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాప్రతినిధులు పక్షపాతం లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగితే ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడనిదేం కాదు. బాసర ఆర్జీయూకేటీకి అనుబంధంగా మరో విశ్వవిద్యాలయం సహా జిల్లాకో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, నాలుగు వైద్య కళాశాలలను బలోపేతం చేస్తే విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తుంది. కవ్వాల్ అభయారణ్యం, కుంటాల, గాయత్రి, పొచ్చెర ప్రాశస్త్యాన్ని గుర్తించి అభివృద్ధి చేస్తే పర్యాటక రంగంలో కొత్త శోభ సంతరించుకుంటుంది.

మూసివేత దిశలో.. ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

● ఫీజుల చెల్లింపులో ప్రభుత్వ తాత్సార ఫలితం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో విద్యాసంస్థలను యజమానులు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు. తక్షణం నిధులు విడుదల చేస్తే తప్ప తాము ముందుకెళ్లలేమని భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో దసరా సెలవుల తర్వాత కళాశాలలు తెరవబోమని స్పష్టంచేస్తూ యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నారు. -న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం



కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘ బాధ్యులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు: సుమారు 94

రావాల్సిన బకాయిలు: దాదాపు రూ.60 కోట్లకు పైగానే..

ఉద్దేశం ఇదీ..

ఆర్థిక కారణాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే లక్ష్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం బోధనా రుసుముల చెల్లింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రైవేటులో చదివే విద్యార్థులకు వారి కోర్సుల రుసుములు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇది రెండు రకాలు. మొదటిది ఎంటీఎఫ్- మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీ (విద్యార్థుల మెస్‌ఛార్జీల కోసం.. ఇది విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమవుతుంది), రెండోది ఆర్‌టీఎఫ్- రీఎంబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (కళాశాలలకు చెల్లించేది, ఇది యాజమాన్య ఖాతాల్లో జమవుతుంది). మొదట్లో నిర్ణీత సమయంలోనే విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఉపకార వేతన రుసుముల చెల్లింపులు జరిగేవి. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఈ ప్రక్రియకు తొలి ఆటంకం ఏర్పడింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విద్యార్థులను ఫీజులు అడగలేక, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు పొందలేక, భవన అద్దె, జీతభత్యాలు, నిర్వహణ వ్యయం.. ఇవన్నీ భరించలేక, అప్పులు చేయడం, వాటికి వడ్డీలు చెల్లించలేక చివరకు మూసేస్తామని ప్రభుత్వానికి నివేదించే స్థాయికి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతబడగా, మరి కొన్ని అదే దారిలో పయనిస్తున్నాయి.

హైకోర్టులో పిల్ దాఖలు చేశాం:

నంగె శ్రీనివాస్, ప్రిన్సిపల్, త్రిదేవి డిగ్రీ కళాశాల, నేరడిగొండ

దాదాపు పదేళ్లుగా అస్తవ్యస్తమై, మూడేళ్లుగా ఉపకార వేతన రుసుముల చెల్లింపులు లేక ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వహణ భారమైంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు ఎన్నోమార్లు విన్నవించాం. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కళాశాలలు మూసేసే పరిస్థితి వచ్చింది. ఇక చేసేదేంలేక ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాం. తాజాగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాం. పండగ తర్వాత విచారణ మొదలు కానుంది.

ఆందోళన బాటలో..

నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. డబ్బుల్లేక నిర్వహణ భారంగా మారుతోందని కళాశాలలు వాపోతుండగా, ప్రభుత్వంపై ఆధారపడి ప్రవేశాలు పొందిన తమ పిల్లల చదువులు కొనసాగించలేక, ఫీజులు చెల్లించలేక, పై చదువులకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతున్నారని పోషకులు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల నుంచి రుసుములు వసూలుకు ఒత్తిడిచేస్తే ఆ కళాశాలలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలంటూ ఉన్నతవిద్యా మండలి అధికారులు ఆదేశిస్తుండటంతో నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నేటితో ముగియనున్న నవరాత్రి ఉత్సవాలు



సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. తొమ్మిది రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. అమ్మవారు సిద్ధిధాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతి దీక్షలు తీసుకున్న భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు చండీయాగం ప్రారంభించారు. గణపతి పూజ, మండపారాధన, స్థాపిత దేవతాహవనం, తదితర పూజలు చేశారు. శనివారంతో నవరాత్రి ఉత్సవాలు ముగియనుండటంతో వేకువజామున నుంచి చండీహోమం, మహాపూర్ణాహుతి ఉంటుందని, అమ్మవారి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయాధికారులు తెలిపారు.

తెలంగాణ అంతటా సింగరేణి వెలుగులు



ఇందారంలోని ఐకేఏ గని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

భీమారం: తెలంగాణ అంతటా వెలుగులు నింపే శక్తిగా సింగరేణి నిలిచిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. జైపూర్ మండలం ఇందారంలోని ఐకే-1ఏ గనిపై శుక్రవారం జరిగిన ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర సమావేశానికి ఆయన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ గతంలో నష్టాల్లో ఉన్నప్పుడు అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న కాకా చొరవతో అప్పుల భారం నుంచి లాభాల్లోకి వెళ్లిందన్నారు. ఈ ఏడాది తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు లాభాలలో వాటా అందజేశారన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీపీపీ ప్రారంభమైన 3 ఏళ్లలోనే జాతీయస్థాయి ఉత్తమ పవర్ జనరేషన్ సంస్థగా అవార్డు సాధించడం గొప్ప విషయమని అన్నారు. త్వరలోనే మరో 800 మెగావాట్ల యూనిట్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులకు, భూమిని కోల్పోయిన నిర్వాసితులకు సంస్థలో ఉద్యోగావకాశాలు త్వరగా కల్పించాలని జీఎంకు సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ. రాజశేఖర్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఎస్టీపీపీ జీఎంలు శ్రీనివాసులు, సముద్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని బలగం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో బడి ఆవరణ తాగుబోతులకు అడ్డాగా మారింది. **- రాంచందర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు**

✔ త్వరలోనే ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. పాఠశాల ఆవరణలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. **- రమేష్, ఎంపీడీవో కాగజ్‌నగర్**

? వల్లకొండ పంచాయతీ సోమయ్యగూడ పశువుల తాగునీటి తొట్టెలో నీరు నిల్వ ఉండటం లేదు. **- బోగ కృష్ణాగౌడ్, స్థానికుడు**

✔ నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. **- రమేష్, ఎంపీడీవో కాగజ్‌నగర్**

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

? మండలంలోని బూరుగూడ బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ చీకట్లు కమ్ముకుంటున్నాయి. వెంటనే విద్యుత్తు బల్బులు అమర్చాలి. **- సురేష్, బీసీ కాలనీ**

✔ విద్యుత్తు బల్బులు అమర్చేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాస్, ఎంపీడీవో, ఆసిఫాబాద్**

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :


? పట్టణంలోని హైమద్‌రజా కాలనీలో మురికి కాల్వలో పూడిక నిండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- ఉమత్‌ఉన్నీసా, హైమద్‌రజా కాలనీ, కాగజ్‌నగర్**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించేందుకు చర్యలు చేపడతాం. **- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్**

వైభవోపేతం.. మహిషాసురమర్దని దర్శనం


కాగజ్‌నగర్ మార్కెట్ ఏరియాలో

తిర్యాణి, కాగజ్‌నగర్ గ్రామీణం, రెబ్బెన, కాగజ్‌నగర్, లింగాపూర్, దహెగాం, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గమ్మ చెంత ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. పలు చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. రెబ్బెన మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో దాండియా ఆడారు. ఇందిరానగర్‌లోని శ్రీ కనకదుర్గా దేవి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో మహా చండీ యాగం చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు.


విలేజ్‌నం.12లో దుర్గామాతకు పూజలు చేస్తున్న బెంగాలీలు


రెబ్బెనలో..


తిర్యాణిలో..


రెబ్బెనలో దాండియా ఆడుతున్న మహిళలు


లింగాపూర్‌లో..


ఆసిఫాబాద్‌లో బాల దుర్గలతో పూజలు చేసిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే దంపతులు, చిత్రంలో అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కలెక్టర్ ఇంట్లో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్, ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవికి శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్టీఎం సరయూ, ఎంఎఫ్ ఉదయ్, టీవీ భారతి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో మసాని శివరాం ఇంటి వద్ద మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పాలనాధికారి వెంకటేశ్ దోత్రే దంపతులు శుక్రవారం ఇంటి వద్ద దుర్గా నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది మంది బాలికలను బాల దుర్గలుగా అలంకరించి పూజల్లో పాల్గొన్నారు. అదనపు పాలనాధికారి దీపక్ తివారీ, టీడీఏ పీవో ఖుష్బూగుప్తా, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, స్త్రీశిశు సంక్షేమశాఖ సిబ్బంది గడ్డల మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రికలోని రాగి తీగ చోరీ



సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మండలంలోని హుడ్కిలి గ్రామంలోని ఎత్తిపోతల పథకంలోని రెండు విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగలను దొంగలు అపహరించినట్లు లిఫ్ట్ ఇరిగేషన్ ఛైర్మన్ ఎం.ఏ రశీద్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఎత్తిపోతల కింద నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, దుబ్బగూడ, సిర్పూర్ గ్రామాల రైతులకు నీరు అందుతుంది. నాలుగు నెలలుగా వర్షాకాలం కారణంగా యంత్రాలని వినియోగించలేదు. నీటి విడుదలకు వచ్చిన ఆపరేటర్ మోటరులో విద్యుత్తు సరఫరా కాకపోవడంతో విద్యుత్తు అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా యంత్రాల్లోని రాగి దొంగిలించినట్టు నిర్ధారించారు. పోలీసులు నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

కారు-ద్విచక్రవాహనం ఢీ.. ఒకరికి గాయాలు

సిర్పూర్(టి), న్యూస్‌టుడే : సిర్పూర్(టి)లోని నాగమ్మ చెరువు వద్ద శుక్రవారం కారు-ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చాముర్షి గ్రామానికి చెందిన కారు కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా సిర్పూర్(టి) నాగమ్మ చెరువు వద్ద లోనవెల్లి గ్రామానికి చెందిన లెక్కల బండన్న అనే వ్యక్తి ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొన్నాయి. దీంతో బండన్నకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్సకు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

గుండె పోటుతో మాజీ సర్పంచి మృతి


లింగయ్య

రెబ్బెన, న్యూస్‌టుడే: రెబ్బెన మండల నంబాల గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన మాజీ సర్పంచి రత్నం లింగయ్య (80) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల నుంచి లింగయ్య గుండె నొప్పితో బాధపడుతుండగా వైద్యం చేయించారు. శుక్రవారం ఇంట్లో ఉండగానే ఆయనకు గుండె నొప్పి రావడంతో మృతి చెందారు. గతంలో లింగయ్య రెండు సార్లు సర్పంచిగా పని చేశారు. 1996లో భాజపా తరపున ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. మృతుని కుటుంబాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి


ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న మాంతయ్య

కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండల కేంద్రంలో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులను డీసీఎంఎస్ జిల్లా వైస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య శుక్రవారం సన్మానం చేశారు. విద్యార్థులకు మంచి బోధన చేసి ఉన్నతులుగా తీర్చిదిద్దాలి.

లింగ వివక్షను విడనాడాలి

వాంకిడి, న్యూస్‌టుడే : లింగ వివక్షను రూపు మాపేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సామాజిక కార్యకర్త డొంగ్రి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇంధానిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఛైల్డ్‌హెల్ప్‌లైన్ సమన్వయ కర్త బాల ప్రవీణ్‌కుమార్, గ్రామ పటేల్ శ్రీకాంత్, ఛైల్డ్‌లైన్ పర్యవేక్షకులు పితంబర్, ఛైల్డ్‌లైన్ కేస్ వర్కర్ సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రకళ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంధకారంలో త్రిశూల్‌పహాడ్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భాగంగా విద్యుత్తు దీపాలంకరణలతో వెలుగొందాల్సిన త్రిశూల్ పహాడ్ శుక్రవారం విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా చీకట్లు కమ్ముకుంది. మధ్యాహ్నం నుంచే త్రిశూల్ పహాడ్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. విద్యుత్‌శాఖ ఏఈకి ఫోన్‌లో సమాచారం అందించేందుకు ప్రయత్నించినా స్పందించలేదు. దీంతో సాయంత్రం నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు చరవాణి దీపాలతోనే పహాడ్‌పై తిరగాల్సి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు రాత్రి త్రిశూల్ పహాడ్‌కు చేరుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

గోడప్రతుల ఆవిష్కరణ

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించే కుమురం భీంతోపాటు కుమురం సూరు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుమురం సూరు ఉత్సవ కమిటీ ఛైర్మన్ మడావి రాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కుమురం సూరు వర్ధంతి గోడ ప్రతులను ఆవిష్కరించారు. కుమురం మారుతి, సిడాం ధర్మ, కనక ప్రభాకర్, కోవ విజయ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బెజ్జూరు, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం బెజ్జూరు మండలంలోని కుశ్నపల్లి-సోమిని రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించారు. ముందుగా సోమినిలో ఆశ్రమోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాలీబాల్ ఫైనల్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు, వరదల కారణంగా కోతకు, కొట్టుకుపోయిన రోడ్ల మరమ్మతులకు జిల్లాకు రూ.3 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. దశలవారీగా బెజ్జూరు మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తలాయిలో రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్సీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాశ్, మాజీ జడ్పీటీసీ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు అర్షద్‌హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు నాహీర్‌అలీ, పెంటన్న, రాజష్, రాజన్న,సల్మాన్, వెంకటేశ్, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీకి పలు సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న తలాయి గ్రామస్థులు

ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి

సిర్పూర్(టి), న్యూస్‌టుడే : మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని భారాస నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. సిర్పూర్(టి) ఆసుపత్రికి వంద సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఇక్కడ సరిపడా వైద్యులు, సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తే మంచిర్యాల, కరీంనగర్‌కు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు చెందిన ప్రజాలైఫ్ ఆసుపత్రిని చక్కగా తీర్చిదిద్ది.. ప్రజలకు ఉచితంగా వైద్యం అందించే ఆసుపత్రిని మాత్రం గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు.


మాట్లాడుతున్న భారాస పార్టీ నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పక్కనే బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

సింగరేణి అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : సింగరేణి సంస్థను అభివృద్ధి బాటలో నిలిపేందుకు తమ కుటుంబం ముందుంటుందని బెల్లంపల్లి శాసన సభ్యుడు గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని ఆఫీసర్స్ క్లబ్ (జీజీసీవోసే)లో ఏర్పాటు చేసిన ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమం ఉద్యోగుల్లో చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థను కాపాడిన ఘనత కాకా వెంకటస్వామికే దక్కిందన్నారు. పెర్క్స్ అలవెన్స్‌పై ఉద్యోగులకు ఆదాయపన్ను లేకుండా కేంద్రంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ముందుగా మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులతో కలిసి బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సింగరేణి సమగ్ర ప్రగతిపై ప్రొజెక్టర్ ద్వారా ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన కల్పించారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఎస్ఓటూ జీఎం రాజమల్లు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : బెల్లంపల్లి ఏరియా గోలేటిలో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యుడు సంగెం ప్రకాష్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్, సీఎండీ బలరాం సింగరేణి లాభాల వాటాలో భాగంగా కాంట్రాక్టు కార్మికులకు రూ. 5 వేలు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్తు అంతరాయాన్ని అరికట్టాలి

కెరమెరి, న్యూస్‌టుడే : విద్యుత్తు సరఫరాలో అంతరాయాన్ని అరికట్టాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సూల్తాన్‌గూడ కాలనీలో ఎక్కువ నివాసాలు ఉండటంతో లోడ్ ఎక్కువ పడుతోందని.. దీంతో పది, పదిహేను నిమిషాలకే విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి అదనపు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించనున్న దసరా పండుగ ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ మైలారపు మురళీధర్ శుక్రవారం పరిశీలించారు. ఆలయ ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద శమీపూజ చేపట్టనున్నందున భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రం చేయించారు. వాసవీసేవా దళ్ జిల్లా అధ్యక్షుడు కంభంపాటి సంతోష్, అర్చకులు సంతోష్‌శర్మ, సత్యనారాయణ, శ్రీనివాస చారి, తదితరులు పాల్గొన్నాను.

అంకిత భావంతో పని చేయాలి

సిర్పూర్(టి), న్యూస్‌టుడే : సిర్పూర్(టి) మండలంలోని పేట్‌మైల వద్ద శుక్రవారం నూతన ఆప్టికల్ హౌస్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపి ప్రజలకు అంకితభావంతో, సేవాభావంతో పనిచేయాలని నిర్వాహకులను కోరారు.

వేధింపులు మానుకోవాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కార్మికులపై డీఎం వేధింపులు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ప్రకటనలో ఆరోపించారు. రోజురోజుకు వేధింపులు పెరుగుతుండటంతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. దసరా పండుగ కోసం టిమ్ డ్రైవర్లకు, ఇతర కార్మికులకు సర్దుబాటు చేసి విధులు కేటాయించాలన్నారు. కానీ ఇక్కడ అధికారి ఏకపక్ష నిర్ణయంతో కొందరు కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి కార్మికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ముగిసిన వాలీబాల్ క్రీడలు

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు మండలం సోమిని ఆశ్రమోన్నత పాఠశాల ఆవరణలో కుమురంభీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. కోటపల్లి మండలం మల్లంపేట జట్టు ప్రథమ బహుమతి గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని సోమిని జట్టు గెలుచుకుంది. తృతీయ బహుమతిని జిల్లెడ జట్టు సొంతం చేసుకుంది. ప్రథమ బహుమతి రూ.15వేల నగదును ఎమ్మెల్సీ దండే విఠల్ అందించారు. ద్వితీయ బహుమతి రూ.10 వేల నగదును మాజీ జడ్పీటీసీ పుష్పలత, మాజీ ఎంపీటీసీ సాయి, మాజీ సర్పంచి శారద-చంద్రశేఖర్‌లు, తృతీయ బహుమతి రూ.4 వేల నగదును కార్యదర్శి రాజేశ్వర్‌లు అందించారు. బహుమతులను మాజీ జడ్పీటీసీ పుష్పలత అందజేశారు.


బహుమతిని అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పుష్పలత


వాడై శ్రీరామ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆర్మీ జవాన్‌కు సన్మానం

వాంకిడి, న్యూస్‌టుడే : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వాడై శ్రీరామ్ ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చాడు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామస్థులు యువకుడిని సన్మానించారు. గ్రామ పెద్దలు గౌరయ్య, బాపూరావు, హన్మంతు గ్రామస్థులు పాల్గొన్నారు.

అవస్థలు చూసి.. గుంతలను పూడ్చి

బెజ్జూరు, న్యూస్‌టుడే : ప్రజల అవస్థలను చూసి సలుగుపల్లి-పెంచికల్‌పేట్ రోడ్డు గుంతలను పూడ్చినట్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు శ్రమదానం పనులు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో సలుగుపల్లి-పెంచికల్‌పేట్ రోడ్డు నిర్మాణాలకు రూ.13 కోట్లు మంజూరయ్యాయని, అటవీ అనుమతులు లేక పనులు సాగలేదన్నారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో గుంతల్లో మొరం వేసి చదును చేసినట్లు తెలిపారు. కాగజ్‌నగర్ మార్కెట్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, కమిటీ మాజీ కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, నాయకులు అమీరుద్దీన్, సకారాం, ఇస్తారి, శ్రీనివాస్, తిరుపతి, విశ్వేశ్వర్‌రావు, శంకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ప్రజాప్రభుత్వంలోనే గీత కార్మికుల సంక్షేమం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని గౌడ సంఘం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కాటమయ్య రక్షా కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులు పాల్గొని గీత కార్మికులకు కిట్లను అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రక్షణ కిట్లను గీత కార్మికులు తప్పనిసరిగా ధరించి రక్షణ పొందాలని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ఎక్సైజ్ సీఐ రవి, జిల్లా మోకుదెబ్బ అధ్యక్షుడు మనోహర్‌గౌడ్, రామగౌడ్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.


గీతకార్మికులకు రక్షాకిట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

ఆదమరిస్తే.. అంతే సంగతి



మండలంలోని గోపాల్‌పూర్ నుంచి రామునాయక్ తండా గ్రామాల ప్రధాన రోడ్డులోని వంతెన అంచున ఉన్న గుంతలో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన అంచున పెద్ద గొయ్యి ఏర్పడింది. ఒక్కసారిగా ఎదుటి నుంచి వాహనాలు వస్తున్న క్రమంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, లింగాపూర్

ఆశయం ఘనం.... అమలు గగనం

మండలంలోని నజ్రుల్‌నగర్ పంచాయతీకి అద్దె రూపేణా ఆదాయం సమకూరాలనే ఆశయంతో పదేళ్ల క్రితం వ్యాపార సముదాయ భవనం నిర్మించారు. మార్కెట్‌లో కాకుండా దూరంగా ఈ భవనాన్ని నిర్మించారు. దీంతో ఎవరూ కూడా వ్యాపార సముదాయ భవనం అద్దెకు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. వినియోగంలో లేకపోవడంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి.
- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్‌గ్రామీణం



రోడ్లపై సేద..
చోదకులకు వ్యథ



మండలంలోని సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై పశువులు రాత్రివేళల్లో వాహన చోదకులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. నిత్యం యథేచ్ఛగా సంచరిస్తూ రోడ్లపైనే సేద తీరుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యక్తులతోపాటు పశువులు కూడా గాయపడుతున్నాయి. సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. అక్కడే పశువులు తిష్ఠ వేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)**